ఉత్తరం కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 27 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 40 | పేజీలు: 4 వెల: 5

# ఫ్యూచర్ సిటీకి మరో దారి!

- తక్కెళ్లపల్లి నుంచి కుర్మిద్ధ, తాటిపర్తి మీదుగా కొత్త రహదారి
- 8 కిలోమీటర్ల మేర రెండు వరుసల రోడ్డు నిర్మాణం
- రూ.30 కోట్ల అంచనా వ్యయంతో పనులు
- భారీ యంత్రాలు.. నిర్మాణ సామగ్రి రవాణాకు ప్రత్యేక మార్గం
- ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- రతన్ టాటా రేడియల్ రోడ్డుకు అనుసంధానం దిశగా అడుగులు



2

# సూపర్ ఎల్‌నినో.. వెయ్యేళ్లలోనే తొలిసారి!

- పసిఫిక్‌లో రికార్డు స్థాయికి చేరిన సముద్ర ఉష్ణోగ్రతలు
- సగటు కంటే 3 డిగ్రీలు పెరిగిన వేడి
- ఏడాది చివరికి 4 డిగ్రీలకు చేరే అవకాశం
- భారత్ వర్షా కాలంపై తీవ్ర ప్రభావం తప్పదా?
- ఇండోనేషియాలో కార్చిచ్చులు.. అమెజాన్‌లో కరవు
- ముందస్తు హెచ్చరికలతోనే ముప్పును ఎదుర్కోవచ్చంటున్న నిపుణులు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ప్రపంచ వాతావరణాన్ని అతలాకుతలం చేసే ఎల్‌నినో మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. ఈసారి దాని తీవ్రత గత అంచనాలను మించే స్థాయికి చేరే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఇప్పటికే రికార్డు స్థాయికి చేరాయని.. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇది 'సూపర్ ఎల్‌నినో'గా మారే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ మాట్ కాలిన్స్ పేర్కొన్నారు. సాధారణంగా ఎల్‌నినో ప్రతి 3 నుంచి 7 ఏళ్లకు ఒకసారి సంభవిస్తుంది. తూర్పు పసిఫిక్‌లో సముద్ర జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వర్షపాత నమూనాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్ మహాసముద్రం తూర్పు ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు చల్లగా ఉంటాయి. ఎల్‌నినో సమయంలో మాత్రం అక్కడి జలాలు అనూహ్యంగా వేడెక్కుతాయి. ఈ మార్పు వాతావరణ వ్యవస్థలపై ప్రభావం చూపి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గులకు కారణమవుతుంది. ఒక ప్రాంతంలో కరవు ఏర్పడితే.. మరొక ప్రాంతంలో ఆకస్మికంగా

........(తరువాయి 2లో)



# చేతగాని.. ఫెయిల్యూర్ సర్కార్!

- ఏటా వేలాది పసికందుల మృతి.. ప్రభుత్వానిదే బాధ్యత
- వైద్యం, విద్యపై ప్రభుత్వంతో యుద్ధం
- బడ్జెట్ కేటాయింపులున్నా.. ఖర్చులో ఎందుకీ కోత?
- రిమ్స్ నుంచి నిమ్స్ వరకు అధ్వాన పరిస్థితులే
- అఫిడవిట్‌లో ఉన్నదానికంటే రూపాయి ఎక్కువున్నా ఇచ్చేస్తా
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేతకాని, అసమర్థ ప్రభుత్వంగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, వైద్య రంగంపై పట్టులేని కారణంగా రాష్ట్రంలో ఏటా వేలాది మంది పసికందులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఇంత ఆధునిక కాలంలో చిన్నారుల మరణాలు కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పరిపాలన చేయడం చేతకాకపోతే బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

........(తరువాయి 3లో)

# బెంగాల్‌లో మమత వర్గానికి వరుస షాక్‌లు!

- సెరాంపుర్ వెళ్తున్న కునాల్ ఘోష్ కారుపై మూక దాడి
- రాళ్లు, కోడిగుడ్లతో దాడి.. ఎమ్మెల్యేకు స్వల్ప గాయాలు
- నల్లజెండాలతో నిరసన.. టీఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు
- 'ఇది జంగిల్ రాజ్'.. పోలీసుల తీరుపై కునాల్ ఘోష్ ఆగ్రహం
- ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్న మమతా బెనర్జీ
- బీజేపీ కార్యకర్తలే దాడి చేశారన్న టీఎంసీ

3



# వరి పంటపై ఎల్‌నినో దెబ్బ

## 67 లక్షల నుంచి 56 లక్షల ఎకరాలకు పడిపోయిన సాగు

గతేడాది 1.50 కోట్ల టన్నులు.. ఈసారి 1.10 కోట్ల టన్నులకే పరిమితం?

20 శాతం తగ్గిన సాధారణ వర్షపాతం.. అడుగంటుతున్న జలాశయాలు

ఆరుతడి పంటల వైపు అన్నదాతలు.. మిల్లెట్ సాగు మూడు రెట్లు

క్వింటాల్ ఫైన్ రైస్ రూ.8 వేలు.. రూ.10 వేలు దాటే ముప్పు

దిగుబడి తగ్గితే బియ్యం కొరత.. ధరల పెరుగుదలపై ఆందోళన



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

ఎల్‌నినో ప్రభావం.. వర్షాభావ పరిస్థితులు.. పడిపోతున్న జలాశయ నీటిమట్టాలు.. తగ్గుతున్న భూగర్భ జలాలు.. వెరసి తెలంగాణలో వరి సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పులు, నైరుతి రుతుపవనాలు సకాలంలో కురవకపోవడంతో ఈసారి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం గతేడాదితో పోలిస్తే వరి సాగు 67 లక్షల ఎకరాల నుంచి 56 లక్షల ఎకరాలకు పడిపోయింది. సుమారు 11 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గడంతో రైతులు ఆరుతడి పంటల వైపు మళ్లారు. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాగునీటి లభ్యత తగ్గడంతో రైతులు పత్తి, కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, రాగుల వైపు అడుగులు వేశారు. గతేడాది 45 లక్షల ఎకరాల్లో ఉన్న పత్తి సాగు ఈసారి 48 లక్షలకు చేరింది. కందులు 5 లక్షల నుంచి 5.5 లక్షల ఎకరాలకు, పెసర్లు 60 వేల నుంచి 1.60 లక్షల ఎకరాలకు, మినుములు 30 వేల నుంచి 70 వేల ఎకరాలకు పెరిగాయి. కొర్రలు, సామలు వంటి మైనర్ మిల్లెట్స్ సాగు 63 ఎకరాల నుంచి దాదాపు 2 వేల ఎకరాలకు చేరింది.

**1.50 కోట్ల టన్నుల నుంచి 1.10 కోట్లకు?**

గత ఖరీఫ్‌లో 1.50 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈసారి 1.10 కోట్ల టన్నులకు పరిమితం కావచ్చని అంచనా. ప్రభుత్వం కూడా 80 లక్షల టన్నులలోపే ధాన్యం సేకరించే పరిస్థితి ఉండొచ్చని భావిస్తున్నారు. సాధారణ వర్షపాతం 20 శాతం తగ్గడం, కాల్వల ద్వారా సాగునీరు అందకపోవడం, రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాల లభ్యత తగ్గడం వరి సాగును దెబ్బతీశాయి. ధాన్యం లభ్యత తగ్గితే దాని ప్రభావం బియ్యం మార్కెట్‌పై పడనుంది. ఇప్పటికే ఫైన్ వెరైటీ బియ్యం క్వింటాల్ ధర రూ.8 వేలకుపైగా పలుకుతోంది. రాబోయే రోజుల్లో రూ.10 వేలు దాటే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని హోల్‌సేల్ వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లోకి అనుకున్న స్థాయిలో ధాన్యం రాకపోతే నిల్వలు తగ్గి కొరత ఏర్పడే పరిస్థితి ఉంటుంది.

........(తరువాయి 2లో)

## కాళేశ్వరం బ్యారేజీలకు పునరుద్ధరణకు కార్యాచరణ

- నవంబర్ రెండో వారంలో పనులకు శ్రీకారం
- 2027 వానాకాలం నాటికి మరమ్మతులు పూర్తి చేసేలా కసరత్తు
- అక్టోబర్ 5న సాంకేతిక నివేదికలు సమర్పణ
- ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాల మేరకే పునరుద్ధరణ
- నాణ్యత, భద్రత విషయంలో రాజీ ఉండదు
- నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



3

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

- ఓట్ల చోరీ జరుగుతోందన్నది వాస్తవమే
- ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓట్లను తొలగించే కుట్ర
- ఓటు హక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- ప్రజాస్వామ్యవాదులు, యువత ముందుకు రావాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



2

# రాష్ట్రంలో 200 కొత్త కోర్టులు!



ఉమ్మడి వరంగల్‌కు 11 కొత్త కోర్టులు

హనుమకొండలో 6.. పరకాలకు ఒకటి

జనగామలో 2.. ఘన్‌పూర్‌కు ఒక కోర్టు

ములుగుకు కొత్తగా మరో కోర్టు

594 కోర్టులకు హైకోర్టు ప్రతిపాదన

తొలిదశలో 200 కోర్టులకు రాష్ట్ర సర్కారు గ్రీన్‌సిగ్నల్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో జిల్లా న్యాయవ్యవస్థను మరింత విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయశాఖ సెప్టెంబర్ 24న జీవోఎంఎస్ నంబర్ 59ను జారీ చేసింది. వివిధ ప్రాంతాల్లో మొత్తం 594 కొత్త కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు ప్రతిపాదనలు పంపగా.. వాటిని పరిశీలించిన ప్రభుత్వం తొలిదశలో 200 కోర్టులకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో కేసుల విచారణకు అదనపు వేదికలు అందుబాటులోకి రానుండటంతోపాటు ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కానున్నాయి. హైకోర్టు ప్రతిపాదనలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్ ప్రాంతానికి తొలిదశలో 11 కొత్త కోర్టులు రానున్నాయి. హనుమకొండ జిల్లాలో హనుమకొండ కేంద్రంగా 6, పరకాలలో ఒక కోర్టు ఏర్పాటు చేయనున్నారు. జనగామ జిల్లాలో జనగామలో 2, ఘన్‌పూర్‌లో ఒక కోర్టు మంజూరైంది. ములుగు జిల్లాకు ములుగు కేంద్రంగా మరో కోర్టు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కొత్తగా న్యాయస్థానాల సంఖ్య పెరగనుంది.

**హనుమకొండకు అత్యధికంగా 7**

అనుబంధంలో పేర్కొన్న వివరాల

........(తరువాయి 2లో)

# ఎఐతో టూరిజానికి కొత్త రూపు

- తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచ పటంలో ప్రత్యేకంగా నిలపాలి
- డిజిటల్ టెక్నాలజీతో పర్యాటక రంగానికి కొత్త ఊపు
- పీపీపీ విధానంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు
- హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు'
- హెల్త్.. ఆలయ.. ప్రకృతి.. గ్రామీణ పర్యాటకానికి ప్రాధాన్యం
- ప్రపంచ పర్యాటక దినోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృత్రిమ మేధ, డిజిటల్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణకు ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 'డిజిటల్ అజెండా-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు' ఇతివృత్తంతో శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 వేడుకల్లో ఆయన మాట్లాడారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా

........(తరువాయి 2లో)

# చేతగాని.. ఫెయిల్యూర్ సర్కార్!

(మొదటిపేజీ తరువాయి)

బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో పసికందుల మరణాల నేపథ్యంలో ఒక మిత్రుడు రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య రంగం పరిస్థితులపై డేటాతో కూడిన సమాచారాన్ని తనకు పంపించారని తెలిపారు. ఆ వివరాలు చూసిన తర్వాత రెండు రోజుల పాటు నిద్ర పట్టలేదని, అందులో భయంకరమైన చేదు వాస్తవాలు ఉన్నాయని అన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేలాది శిశు మరణాలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 202021లో 6 వేల మంది, 202223లో 4,933 మంది, 202425లో 3,853 మంది పసికందులు మృతి చెందినట్లు కవిత తెలిపారు. దాదాపు ప్రతి జిల్లాలో ఏటా 200 వరకు చిన్నారుల మరణాలు నమోదవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న పాలకులు.. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1,046 మంది చిన్నారులు మృతి చెందినా కనీసం మానవత్వంతో స్పందించడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితులకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైతే పాలన నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో 10 శాతం కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం 5 శాతం కూడా కేటాయించడం లేదని కవిత ఆరోపించారు. కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని విమర్శించారు. గతేడాది వైద్య రంగానికి రూ.13,192 కోట్లు కేటాయిస్తే రూ.9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. కేటాయించిన నిధులను సైతం వినియోగించని ప్రభుత్వ తీరును కాగ్ తప్పుపట్టిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 11 ఆరోగ్య పథకాలు ఉంటే.. 7 పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆమె అన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.700 కోట్లు కేటాయించి కేవలం రూ.140 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. మరోవైపు ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.500 కోట్ల వరకు పేరుకుపోయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు.

**రిమ్స్‌లో చెత్తాచెదారం**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపించిందని అన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి, ప్రతిపక్ష నాయకులు రిమ్స్‌ను సందర్శించినా అక్కడ పరిస్థితుల్లో మార్పు కనిపించలేదని చెప్పారు. ఒక ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. మిగతా ఆసుపత్రుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లను ఎందుకు క్రమం తప్పకుండా తనిఖీ చేయడం లేదని కవిత ప్రశ్నించారు. ప్రజల బాగోగులు చూడటం కంటే కలెక్టర్లకు ముఖ్యమైన పని ఏముంటుందని నిలదీశారు. కలెక్టర్లు తరచూ ఆసుపత్రులను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తే పరిస్థితుల్లో మార్పు వస్తుందని అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి కూడా బాధ్యతగా వ్యవహరించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత పెద్ద ప్రమాదం జరిగిన తరువాతే ఆరోగ్యశాఖ మంత్రి ఆదిలాబాద్ రిమ్స్‌ను సందర్శించారని కవిత ఆరోపించారు. ఆదిలాబాద్‌కు వచ్చిన సమయంలో జిల్లాలో వైద్య పరిస్థితులపై దృష్టి పెట్టకుండా హెలికాప్టర్ ఇంధనం అయిపోయిందన్న అంశంపై గొడవపడి వెళ్లిపోయారని విమర్శించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వలేదని అన్నారు. ఆదిలాబాద్‌లో రోడ్ల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, సరైన రోడ్లు లేకపోవడం వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఐటీడీఏ పరిధిలోని నిధుల్లో 70 శాతం కూడా వినియోగించుకోవడం ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. ఆ నిధులను ఉపయోగించి ఉట్నూర్ ఏజెన్సీలో రహదారులు నిర్మించాలని సూచించారు.

**నిలోఫర్‌లో 200 శాతం ఆక్యుపెన్సీ**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని కవిత అన్నారు. నిలోఫర్ ఆసుపత్రిలో బెడ్ ఆక్యుపెన్సీ 200 శాతంగా ఉండటంతో రోగులకు బెడ్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. నిమ్స్‌లో ముఖ్యమంత్రి చెబితే తప్ప బెడ్ దొరకడం లేదని, ఆరోగ్యశాఖ మంత్రి చెప్పినా పరిస్థితి మారడం లేదని వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో శస్త్రచికిత్స కోసం 7 నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు కనీసం శానిటరీ ప్యాడ్లు పారవేసేందుకు అవసరమైన సదుపాయాలు కూడా లేవని కవిత అన్నారు. విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టేలా ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామని కవిత హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని ప్రజల ద్వారా ప్రశ్నించే కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ప్రజలు, యువత ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితులను పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రులకు వెళ్లి అక్కడి సమస్యలను ఫొటోలు తీసి టీఆర్ఎస్‌కు పంపించాలని కోరారు. టీఆర్ఎస్ కార్యకర్తలు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి బాత్‌రూమ్‌ల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. అవసరమైతే పార్టీ తరఫున చందాలు వేసి బాత్‌రూమ్‌లు నిర్మించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే పార్టీగా ఇకపై రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తామని తెలిపారు.

**పేదలకు 25 శాతం ఉచిత వైద్యం ఎక్కడ?**

ప్రభుత్వం నుంచి స్థలాలు తీసుకుని పేదలకు 25 శాతం ఉచిత వైద్యం అందిస్తామని ఒప్పందాలు చేసుకున్న కార్పొరేట్ ఆసుపత్రులు పేదలను గేటు లోపలికి కూడా రానివ్వడం లేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఆయా ఆసుపత్రుల్లో ఒప్పందం ప్రకారం 25 శాతం ఉచిత వైద్యం పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా వాటి అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క రూపాయి ఎక్కువగా తన వద్ద ఉన్నట్లు ఎవరైనా నిరూపిస్తే ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తానని కవిత స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ చట్టబద్ధంగానే నిర్మించుకున్నదని చెప్పారు. అందులో కబ్జా భూమి, ఎఫ్‌టీఎల్ జోన్ లేదా అసైన్డ్ ల్యాండ్ లేదన్నారు. తాను సంపాదించిన ప్రతి పైసా చట్టానికి లోబడే సంపాదించుకున్నదని, భవిష్యత్తులోనూ అదే విధంగా ఉంటానని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌లకు సంబంధించి ఏర్పాటు చేసిన సిట్ నిరుపయోగమని కవిత వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌తోపాటు పలు అంశాల్లో సిట్‌లు ఏర్పాటు చేసినా వాటి ద్వారా ఏమి సాధించారని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి ఇలాంటి సిట్‌లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అంతర్గతంగా ఒప్పందాలు జరిగే వరకు ఇలాంటి సిట్‌లు కొనసాగుతూనే ఉంటాయని విమర్శించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కవిత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకున్న ఆమె.. అదే స్ఫూర్తితో బహుజన తెలంగాణ సాధన కోసం ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్. రూప్‌సింగ్, నవీన్ ఆచారి, మాధవి, శ్రీకాంత్‌రావు, అర్చనా సేనాపతి, రాంకోటి, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎఐతో టూరిజానికి కొత్త రూపు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర పర్యాటక రంగాన్ని పునర్‌నిర్మించాల్సిన అవసరం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచస్థాయి పర్యాటకులను ఆకర్షించేందుకు డిజిటల్ వేదికలను సమర్థంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై ఆవిష్కరించేలా రూపొందించిన నూతన వెబ్‌సైట్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**హెల్త్.. ఆలయ.. ప్రకృతి పర్యాటకం**

తెలంగాణలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటకానికి అపార అవకాశాలు ఉన్నాయని భట్టి తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ప్రశాంతత కోరుకునే వారికి తెలంగాణ అనువైన గమ్యస్థానమని పేర్కొంటూ.. వీటిని అంతర్జాతీయ స్థాయిలో సమర్థంగా మార్కెటింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ విధానంలో పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేసి భారీ పెట్టుబడులను ఆకర్షించాలని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు టూరిజం కూపన్లు**

వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని భట్టి సూచించారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు' అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటకం కేవలం వినోదం మాత్రమే కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ పలు నూతన కార్యక్రమాలను ప్రారంభించింది. పునర్‌రూపకల్పన చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, 'మై తెలంగాణ, మై స్టోరీ, మై డెస్టినేషన్' వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియోను భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు.

**పురావస్తు శాఖతో అవగాహన ఒప్పందం**

మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎఐ-డిజిటల్ టెక్నాలజీ, ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర అంశాలపై ప్యానెల్ చర్చ నిర్వహించారు. సదస్సులో యువ టూరిజం క్లబ్‌ల విద్యార్థులు, టూరిస్ట్ పోలీస్, తెలంగాణ దర్శిని, శిక్షణ పొందిన గైడ్లు, హోమ్‌స్టే నిర్వాహకులు తమ అనుభవాలను పంచుకున్నారు. పర్యాటక రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కొత్త అవకాశాలపై చర్చించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, టీజీఏ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి, సినీ నటులు తిరువరూర్, ఫరియా అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో 200 కొత్త కోర్టులు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం హనుమకొండ జిల్లాకు అత్యధికంగా 7 కొత్త కోర్టులు మంజూరయ్యాయి. హనుమకొండలో 6, పరకాలలో ఒకటి చొప్పున ఏర్పాటు కానున్నాయి. కేసుల సంఖ్య, న్యాయ సేవల అవసరం, ప్రజలకు న్యాయస్థానాలు అందుబాటులో ఉండేలా చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ కోర్టుల ఏర్పాటు ప్రతిపాదనలు రూపొందించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనగామ జిల్లాలో మొత్తం 3 కొత్త కోర్టులు ఏర్పాటు కానున్నాయి. జనగామలో 2, ఘన్‌పూర్‌లో ఒక కోర్టు చొప్పున మంజూరైంది. ములుగు జిల్లాలో ములుగు కేంద్రంగా ఒక కొత్త కోర్టు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు న్యాయసేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం కొంత మేర తగ్గనుంది. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో 594 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు ప్రతిపాదనలు పంపింది. కోర్టుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, పునరావృత, పునరావృతేతర వ్యయాల వివరాలను కూడా ప్రతిపాదనల్లో పొందుపరిచింది. ప్రభుత్వం వీటిని పరిశీలించి తొలి దశలో 200 కోర్టులకు ఆమోదం తెలిపింది.

**మౌలిక వసతులపై దృష్టి**

కొత్త కోర్టులకు అవసరమైన భవనాలు, మౌలిక వసతులు, సిబ్బంది, బడ్జెట్ తదితర అంశాలపై తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఆయా కోర్టులకు అవసరమైన సిబ్బంది నియామకం, ఇతర వ్యయాలకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థికశాఖ అనుమతితోనే ప్రస్తుత ఉత్తర్వులు జారీ చేసినట్లు జీవోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా ఖజానా అధికారులకు పంపించారు. కొత్త కోర్టుల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్‌ను ప్రభుత్వం ఆదేశించింది. తొలి దశలో మంజూరైన 200 కోర్టుల వివరాలను జీవోకు అనుబంధంగా పొందుపరిచారు. కొత్త కోర్టుల ఏర్పాటుతో జిల్లా న్యాయవ్యవస్థపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు అదనపు వేదికలు ఏర్పడనున్నాయి. ముఖ్యంగా హనుమకొండ, పరకాల, జనగామ, ఘన్‌పూర్, ములుగు ప్రాంతాలకు కొత్త కోర్టులు మంజూరు కావడం ఉమ్మడి వరంగల్ ప్రాంతానికి ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కోర్టులు ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి, సిబ్బంది నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయి, భవనాలు ఎక్కడ ఏర్పాటు చేస్తారన్న అంశాలపై తదుపరి ఉత్తర్వుల్లో స్పష్టత రానుంది. హైకోర్టు ప్రతిపాదించిన 594 కోర్టుల్లో 200కు ప్రభుత్వం తొలిదశలో అనుమతి ఇచ్చింది. మిగిలిన కోర్టుల ఏర్పాటుపై తదుపరి దశల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర న్యాయవ్యవస్థ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లైంది. కొత్త కోర్టులకు అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, ఆర్థిక కేటాయింపులు పూర్తయిన తర్వాతే అవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

# ఫ్యూచర్ సిటీకి మరో దారి!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీకి మరో రహదారి అందుబాటులోకి రానుంది. హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మార్గంలోని తక్కెళ్లపల్లి నుంచి కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల మీదుగా 8 కిలోమీటర్ల మేర కొత్త రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును రెండు వరుసలుగా విస్తరిస్తూ రూ.30 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో పరిశ్రమల నిర్మాణం ఊపందుకుంటున్న నేపథ్యంలో భారీ యంత్రాలు, నిర్మాణ సామగ్రి తరలింపునకు ప్రత్యేక మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ఈ రహదారి ప్రధాన ఉద్దేశంగా అధికారులు భావిస్తున్నారు.

**పరిశ్రమల కోసం ప్రత్యేక రహదారి**

ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో పారిశ్రామిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. తక్కెళ్లపల్లి వైపు 10 బహుళజాతి సంస్థలకు సుమారు వెయ్యి ఎకరాల భూమిని కేటాయించారు. ఆయా సంస్థలు పరిశ్రమల నిర్మాణ పనులు చేపట్టడంతో భారీ యంత్రాలు, పరికరాలు, నిర్మాణ సామగ్రిని తరలించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తమ కార్యకలాపాలకు అనువుగా ప్రత్యేక రహదారి నిర్మించాలని కంపెనీలు అధికారులను కోరినట్లు సమాచారం. దీంతో తక్కెళ్లపల్లి నుంచి కుర్మిద్ద, తాటిపర్తి మీదుగా కొత్త మార్గం అభివృద్ధి చేస్తున్నారు.

**ప్రధాన మార్గంపై తగ్గనున్న ఒత్తిడి**

ప్రస్తుతం ఫ్యూచర్ సిటీకి వెళ్లేందుకు తుక్కుగూడ నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఉన్న రహదారే ప్రధాన మార్గంగా ఉంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ అధికారులు, విదేశీ ప్రతినిధులు, అమెజాన్ డేటా సెంటర్ నిర్వాహకులు, పరిసర గ్రామాల ప్రజలు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారు. పరిశ్రమలు, ఇతర సంస్థల నిర్మాణ పనులు వేగం పుంజుకుంటే భారీ వాహనాల రాకపోకలు మరింత పెరగనున్నాయి. పెద్ద యంత్రాలు, భారీ పరికరాలను తరలించే వాహనాల రాకపోకలతో ప్రధాన మార్గంపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గంగా తక్కెళ్లపల్లి రహదారిని అభివృద్ధి చేస్తున్నారు.

**రవాణాకు మరింత వెసులుబాటు**

కొత్త రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రిని తరలించడం సులభం కానుంది. భారీ వాహనాలు ప్రధాన రహదారిపైకి వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో ట్రాఫిక్ రద్దీని కొంత మేర నియంత్రించే అవకాశం ఉంటుంది. పరిశ్రమల నిర్మాణ దశలోనే కాకుండా భవిష్యత్తులో వాణిజ్య కార్యకలాపాలు పెరిగినప్పుడు సరకు రవాణాకు కూడా ఈ మార్గం ఉపయోగపడే అవకాశం ఉంది. తక్కెళ్లపల్లి నుంచి నిర్మిస్తున్న రహదారిని భవిష్యత్తులో రతన్ టాటా రేడియల్ రోడ్డుతో అనుసంధానించాలన్నది అధికారుల ప్రణాళికగా ఉంది. ఈ అనుసంధానం పూర్తయితే ఫ్యూచర్ సిటీ నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలకు మరో మార్గం అందుబాటులోకి వస్తుంది. కొంగరకలాన్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలకు కూడా ఈ మార్గం ఉపయోగపడనుంది.

**విస్తరిస్తున్న రోడ్ల నెట్‌వర్క్**

ఫ్యూచర్ సిటీ చుట్టూ పరిశ్రమల ఏర్పాటు, భారీ పెట్టుబడుల నేపథ్యంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధి కీలకంగా మారుతోంది. ఇప్పటికే ఉన్న ప్రధాన మార్గానికి ప్రత్యామ్నాయంగా కొత్త రహదారులు అందుబాటులోకి వస్తే పారిశ్రామిక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడనుంది. తక్కెళ్లపల్లి-కుర్మిద్ద-తాటిపర్తి మార్గం భవిష్యత్తులో రేడియల్ రోడ్డు, ఓఆర్ఆర్ వైపు అనుసంధానమైతే ఫ్యూచర్ సిటీ రవాణా వ్యవస్థ మరింత విస్తరించే అవకాశం ఉంది. పరిశ్రమల నిర్మాణం పూర్తయి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత పెరిగే సరకు రవాణాకు అనుగుణంగా ఈ మార్గం కీలకంగా మారే అవకాశం ఉంది.

# సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి

- ఓట్ల చోరీ జరుగుతోందన్నది వాస్తవమే
- ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓట్లను తొలగించే కుట్ర
- ఓటు హక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- ప్రజాస్వామ్యవాదులు, యువత ముందుకు రావాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీకి రాజకీయంగా అవసరమైన చోట ఓట్ల చోరీ జరుగుతోందని విమర్శించారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తున్నప్పుడు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఓటర్లు ఒకరే అయినప్పుడు ఎన్నికల ఫలితాల్లో ఇంత వ్యత్యాసం ఎలా వస్తోందని నిలదీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ యువతలో ఆందోళనకు కారణమవుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తాను 10 సార్లు ఓటు వేసిన నిజామాబాద్‌లోనే తన ఓటును తొలగించేందుకు కుట్ర చేశారని, తనకు కుట్రపూరితంగా నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. లౌకికవాదుల ఓట్లను తొలగించే ప్రక్రియ సాగుతోందని విమర్శించారు.

**సీఈసీని తొలగించాలి**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే తొలగించాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన వ్యవహారశైలి ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజల్లో సందేహాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్‌పై తమ అభ్యంతరాలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు నిరసనగా సెప్టెంబర్ 28న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించనున్నట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే సీఈసీపై అవిశ్వాసానికి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, ఎన్నికల ప్రక్రియలో రాజకీయ జోక్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వరి పంటపై ఎల్‌నినో దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)



వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించే అవకాశం కూడా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**శాస్త్రవేత్తల అధ్యయనంలోనూ ఆందోళన**

ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందం ఖరీఫ్ సాగుపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసింది. సస్టెయినబుల్ అగ్రికల్చర్ సెంటర్ డైరెక్టర్ సమరేందు మహంతి ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో వాతావరణ ప్రతికూలతల కారణంగా వరి దిగుబడి తగ్గే పరిస్థితిని గుర్తించినట్లు సమాచారం. వరి దిగుబడిలో దేశంలోనే ముందున్న తెలంగాణ ఈసారి కూడా అదే స్థానంలో ఉండే అవకాశం ఉన్నప్పటికీ గతంతో పోలిస్తే దిగుబడి గణనీయంగా తగ్గనుందని అంచనా. ప్రత్యామ్నాయ పంటలు వేసినా పెట్టుబడులు పెరగడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. బోర్లు, బావులపై ఆధారపడి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేసినా వర్షాభావం, విద్యుత్ సరఫరా సమస్యలు ప్రతికూలంగా మారాయి. ప్రభుత్వం అందించిన విత్తనాలు, ఎరువులు కొంతమేర ఉపయోగపడినా.. వర్షాలు సరిగా కురవకపోవడం తీవ్ర నిరాశ కలిగించింది. నష్టపరిహారం, ప్రత్యామ్నాయ ఉపాధి, శాశ్వత సాగునీటి వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

**రబీపై మరింత ఒత్తిడి?**

ఖరీఫ్‌లోనే వరి సాగు, దిగుబడి తగ్గిన నేపథ్యంలో రాబోయే రబీపై మరింత ఒత్తిడి పడే అవకాశం ఉంది. వరి సాగు తగ్గితే మిల్లులు, వాటిపై ఆధారపడిన కార్మికుల ఉపాధిపైనా ప్రభావం పడొచ్చు. బియ్యం ఎగుమతులు తగ్గితే ప్రభుత్వ ఆదాయంపైనా ప్రభావం ఉండొచ్చు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు వ్యవసాయ ప్రణాళికలు, సాగునీటి నిర్వహణ, రైతులకు శాస్త్రవేత్తల సూచనలు అందించడం అత్యవసరంగా మారింది. ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో ధాన్యం లభ్యత, బియ్యం ధరలపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది.

# సూపర్ ఎల్‌నినో.. వెయ్యేళ్లలోనే తొలిసారి!

(మొదటిపేజీ తరువాయి)

భారీ వర్షాలు, వరదలు సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది.

**3 డిగ్రీల వేడి.. 4 డిగ్రీలకు?**

ఈ ఏడాది తూర్పు పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత సగటు కంటే ఇప్పటికే సుమారు 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైనట్లు నిపుణులు పేర్కొన్నారు. 2015లో నమోదైన రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో ఇది సమానంగా ఉందని చెబుతున్నారు. అయితే ప్రస్తుత ఎల్‌నినో ఇంకా గరిష్ఠ స్థాయికి చేరలేదని.. ఈ ఏడాది చివరి నాటికి సగటు కంటే 4 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని పరిశోధకుల అంచనా. అదే జరిగితే వాతావరణంపై ప్రభావం మరింత తీవ్రంగా ఉండొచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్‌నినో ప్రభావం భారత వర్షాకాలంపైనా పడే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాకాలం బలహీనపడితే వ్యవసాయ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో పంటల సాగు, నీటి లభ్యత, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం చూపే పరిస్థితులు ఏర్పడవచ్చు. అయితే వర్షపాతం ప్రాంతాలవారీగా మారే అవకాశం ఉండటంతో ఎల్‌నినో ప్రభావాన్ని అన్ని ప్రాంతాలకు ఒకే విధంగా వర్తింపజేయలేమని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి.

**ఇండోనేషియాలో కార్చిచ్చుల ముప్పు**

ఎల్‌నినో ప్రభావంతో ఆగ్నేయాసియాలో పొడి వాతావరణం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇండోనేషియాలో కరవు పరిస్థితులు తీవ్రమైతే కార్చిచ్చుల ముప్పు పెరగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెజాన్ వర్షారణ్య ప్రాంతంలోనూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. భారీగా విస్తరించిన అటవీ ప్రాంతాల్లో పొడి వాతావరణం కార్చిచ్చుల తీవ్రతను మరింత పెంచే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రభావం పసిఫిక్ పరిధికే పరిమితం కాకుండా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల వాతావరణ వ్యవస్థలపైనా పడే అవకాశం ఉంది. ఐరోపా, బ్రిటన్ వంటి ప్రాంతాల్లో చలికాలంలో అకాల, అధిక వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ఒకే సమయంలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపించే అవకాశం ఉంటుంది. ఎల్‌నినోను ముందుగానే గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం మరింత అభివృద్ధి చెందిందని నిపుణులు చెబుతున్నారు. సుమారు 6 నుంచి 9 నెలల ముందే ఎల్‌నినో తీవ్రతను అంచనా వేసే అవకాశం ఉండటంతో.. ప్రభావిత దేశాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవచ్చని సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులు వాతావరణ అంచనాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా ముందస్తు వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

**రైతులకు ముందస్తు హెచ్చరికలు**

లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లో రైతులకు ముందుగానే వాతావరణ హెచ్చరికలు అందించడం ద్వారా పంట నష్టాలను కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపాతం తగ్గే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు, నీటి నిర్వహణ, సాగు ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఆగ్నేయాసియా దేశాలు కార్చిచ్చుల నివారణకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. ఎల్‌నినో సహజ వాతావరణ చక్రంలో భాగమైనప్పటికీ.. గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న నేపథ్యంలో దాని ప్రభావాల తీవ్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భూతాపానికి కారణమయ్యే గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడమే దీర్ఘకాలిక పరిష్కారమని ప్రొఫెసర్ మాట్ కాలిన్స్ సూచించినట్లు సమాచారం. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించేందుకు ఉద్గారాల నియంత్రణతోపాటు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ప్రపంచ వాతావరణానికి హెచ్చరిక**

ఎల్‌నినో తీవ్రత పెరిగితే దాని ప్రభావం ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని పలు ప్రాంతాలపై పడే అవకాశం ఉంటుంది. వర్షపాతంలో మార్పులు, కరవు, వరదలు, అటవీ కార్చిచ్చులు, వ్యవసాయంపై ప్రభావం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అందుకే ఎల్‌నినో తీవ్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణ రంగాల్లో ముందస్తు చర్యలు చేపట్టడం కీలకంగా మారనుంది.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**కాకతీయ, శంకరపట్నం :** తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన చిట్యాల ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని శంకరపట్నం మండల కేంద్రంలో శనివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో అనిత, ఎస్సై కట్కూరి శేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ జీవితాన్ని, ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజురాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు గోపగోని బసవయ్య, గాజుల మహేష్, మాజీ జెడ్పీటీసీలు బత్తిని శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పొద్దుటూరు సంజీవరెడ్డి, మండల నాయకులు బండారి తిరుపతి, గంట మహిపాల్, ఎనుగుల అనిల్, పిట్టల సమ్మయ్య, సర్పంచులు గోదారి రాజేంద్రప్రసాద్, వెన్నం మల్లేశం, కొయ్యడ కుమార్, నెలవేని మహేష్, విద్యాసాగర్‌రావు, రజక సంఘం నాయకులు కల్లెపెల్లి క్రాంతికుమార్, రాసమల్ల శ్రీనివాస్, కల్లెపెల్లి కిరణ్, దండు కొమురయ్య, కల్లెపెల్లి రాజయ్య, దండు సమ్మయ్య, పావురాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల నర్సింహులు శతజయంతికి బీసీలంతా తరలిరావాలి

- మన ఆలోచన–మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింహులు



**కాకతీయ, రఘునాథపల్లి :** అక్టోబర్ 2న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సబ్బండ వర్గాల ఆశాజ్యోతి, పద్మశాలి ముద్దుబిడ్డ నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలకు బీసీలంతా ఐక్యంగా తరలిరావాలని మన ఆలోచన-మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింహులు పిలుపునిచ్చారు. శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలో శతజయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. బలహీన, అట్టడుగు, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సమాజ అభివృద్ధికి కృషి చేసిన మేధావులను స్మరించుకుంటూ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 2న జనగామ కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా సూర్యాపేట రోడ్డులోని నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బతుకమ్మ కుంటలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్ల నర్సింహులు విగ్రహాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కూడా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గునిగంటి చంద్రశేఖర్ గౌడ్, పూస రవి గంగపుత్ర, సింగార రవీందర్, పిట్టల సత్యం, వంగ రవి, రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఇంట్లో తనిఖీలు.. 50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- రూ.1.75 లక్షల విలువైన బియ్యం పట్టివేత
- టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ ఆధ్వర్యంలో దాడి



**కాకతీయ, నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం నెక్కొండ పోలీసులతో కలిసి పానికర గ్రామంలో దాడి నిర్వహించింది. గ్రామానికి చెందిన గార్నపల్లి జితేందర్‌రెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టగా 50 క్వింటాళ్ల (5,000 కిలోలు) పీడీఎస్ విరిగిన బియ్యం పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.1.75 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం నెక్కొండ పోలీసులకు అప్పగించారు. జితేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ జి. సుబ్బారెడ్డి, ఎస్ఐ బి. ఉప్పలయ్య ఆధ్వర్యంలో బృందం దాడి నిర్వహించింది.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి పిలుపు**



కాకతీయ, నల్లబెల్లి : తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య దొరల అణచివేతకు, వెట్టి చాకిరి విధానానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ అణచివేత, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడిన ధైర్యానికి ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ చూపిన ధైర్యం, తెగువ నేటి తరాలకు ఆదర్శమన్నారు. అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం ఐక్యంగా పోరాడే స్ఫూర్తిని ఐలమ్మ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ పొందాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి పిలుపు**



**కాకతీయ, నల్లబెల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య దొరల అణచివేతకు, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ అణచివేత, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడిన ధైర్యానికి ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ చూపిన ధైర్యం, తెగువ నేటి తరాలకు ఆదర్శమన్నారు. అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం ఐక్యంగా పోరాడే స్ఫూర్తిని ఐలమ్మ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ పొందాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీలకు పునరుద్ధరణకు కార్యాచరణ



- నవంబర్ రెండో వారంలో పనులకు శ్రీకారం
- 2027 వానాకాలం నాటికి మరమ్మతులు పూర్తి చేసేలా కసరత్తు
- అక్టోబర్ 5న సాంకేతిక నివేదికలు సమర్పణ
- ఎన్‌డీఎస్ఏ మార్గదర్శకాల మేరకే పునరుద్ధరణ
- నాణ్యత, భద్రత విషయంలో రాజీ ఉండదు
- నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జలసౌధలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ధరణ ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిపుణుల సూచనలు, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని నిర్ణయించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారం నుంచి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమీక్షలో వెల్లడించారు. దెబ్బతిన్న నిర్మాణాలపై నిర్వహిస్తున్న సాంకేతిక పరీక్షలు, అధ్యయనాల ఆధారంగా మరమ్మతుల విధానాన్ని ఖరారు చేయనున్నారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా సమగ్రంగా పరిశీలించి పనులు చేపట్టనున్నారు.

**అక్టోబర్ 5న సాంకేతిక నివేదిక**

కేంద్ర జల సంఘం సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి అక్టోబర్ 5న పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లు, సాంకేతిక వివరాలు సమర్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కేంద్ర సంస్థల సూచనలు, అవసరమైన అనుమతులు వచ్చిన అనంతరం పనులను ముందుకు తీసుకెళ్లనున్నారు. ఇప్పటికే మేడిగడ్డలో భౌగోళిక, భూసాంకేతిక పరీక్షలు, నమూనాల సేకరణ కొనసాగుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. 2027 వానాకాలం ప్రారంభానికి ముందే మూడు బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలకు అనుగుణంగానే పునరుద్ధరణ చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బ్యారేజీలను పటిష్ఠంగా పునరుద్ధరించడంతోపాటు భవిష్యత్‌లో భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో సాంకేతిక నిపుణులు, కేంద్ర సంస్థలు, నీటిపారుదల శాఖ సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు.

## ఉపఎన్నికలో ప్రత్యక్షంగా పోటీ చేస్తాం

- ఖైరతాబాద్ బరిలో తెలంగాణ రక్షణ సేన
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- ఫామ్‌హౌస్ పేరుతో రాజకీయ హైడ్రామా ఆపాలి
- తెర ముందు విమర్శలు.. తెర వెనుక లాలూచీనా?
- ప్రజా సమస్యలపై పాలకులు సమాధానం చెప్పాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** ఖైరతాబాద్ ఉపఎన్నికలో తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రత్యక్షంగా బరిలో నిలుస్తామని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ పేరిట సరికొత్త రాజకీయ హైడ్రామాకు తెర లేపుతున్నారని విమర్శించారు. పాలకులు గంటకో మాట.. పూటకో బాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇది మాటలకే పరిమితమైన ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ స్థానం ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. ప్రధాన పార్టీల నేతలు తెరముందు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, తెరవెనుక లోపాయికారీ ఒప్పందాలు కొనసాగుతున్నాయని కవిత ఆరోపించారు. ఫామ్‌హౌస్‌ల అంశంపై కాలయాపన తప్ప పాలకుల నుంచి కఠిన చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ అంశాలతో కాలం గడపడం సరికాదని కవిత అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రజా సమస్యలపై స్పష్టమైన సమాధానాలు రాబట్టేందుకు తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. ఖైరతాబాద్ ఉపఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేయనున్నట్లు కవిత చేసిన ప్రకటనతో ఆ పార్టీ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగనుంది. ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి ప్రజల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకెళ్తామని ఆమె ప్రకటించారు.

## బెంగాల్‌లో మమత వర్గానికి వరుస షాక్‌లు!

- సెరాంపూర్ వెళ్తున్న కునాల్ ఘోష్ కారుపై మూక దాడి
- రాళ్లు, కోడిగుడ్లతో దాడి.. ఎమ్మెల్యేకు స్వల్ప గాయాలు
- నల్లజెండాలతో నిరసన.. టీఎంసీకి వ్యతిరేకంగా నినాదాలు
- 'ఇది జంగిల్ రాజ్'.. పోలీసుల తీరుపై కునాల్ ఘోష్ ఆగ్రహం
- ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్న మమతా బెనర్జీ
- బీజేపీ కార్యకర్తలే దాడి చేశారన్న టీఎంసీ



**కాకతీయ, నేషనల్ బ్యూరో :** పశ్చిమబెంగాల్‌లో రాజకీయ ఉద్రిక్తత కొనసాగుతోంది. సెరాంపూర్‌లో టీఎంసీ నిర్వహిస్తున్న బహిరంగ సభకు హాజరయ్యేందుకు వెళ్తున్న టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కారుపై కొందరు వ్యక్తులు రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేశారు. నల్లజెండాలు ప్రదర్శిస్తూ టీఎంసీ, మమతా బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనలో కునాల్ ఘోష్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కోల్‌కతాకు వెళ్తున్నట్లు తెలిపారు. తనపై జరిగిన దాడిని కునాల్ ఘోష్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ నాయకులే తన కారుపై రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేసి రహదారిని దిగ్బంధించారని ఆరోపించారు. దాడి జరిగిన సమయంలో అక్కడ పోలీసులు కనిపించలేదని అన్నారు. తనపై దాడి చేసినవారిపై లాల్‌బజార్ లేదా భవానీ భవన్‌లో ఫిర్యాదు చేస్తానని చెప్పారు. బీజేపీ పాలనలో 'జంగల్ రాజ్' కొనసాగుతోందని వ్యాఖ్యానించారు.

**'ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు'**

కునాల్ ఘోష్‌పై దాడి ఘటనపై మమతా బెనర్జీ స్పందించారు. సెరాంపూర్ ర్యాలీకి హాజరు కాకుండా తమ వర్గానికి చెందిన టీఎంసీ నేతలను గృహ నిర్బంధంలో ఉంచారని ఆమె ఆరోపించారు. ర్యాలీ జరిగే ప్రాంతానికి వెళ్లే మార్గాలను బీజేపీ కార్యకర్తలు దిగ్బంధించారని, పోలీసులు వారికి సహకరిస్తున్నారని విమర్శించారు. 15 రోజుల ముందే కోర్టు అనుమతి తీసుకున్నప్పటికీ తనను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని చెప్పారు. కునాల్ ఘోష్ కారుపై దాడి ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం కాదన్నారు. టీఎంసీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కల్యాణ్ బెనర్జీ కూడా పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. గత రెండు మూడు రాత్రులుగా సెరాంపూర్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు ఇంటింటికీ వెళ్లి మమతా బెనర్జీ ర్యాలీకి హాజరైతే అరెస్టు చేస్తామని ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. రిష్రాలోని 5, 6వ వార్డుల్లో మైనారిటీ మహిళలను కూడా హెచ్చరించారని చెప్పారు. పోలీసు అధికారాల దుర్వినియోగంపై హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు.

**'ముందస్తు ప్రణాళికతోనే దాడి'**

కునాల్ ఘోష్‌పై జరిగిన దాడి సామాన్య ప్రజల నిరసన కాదని, బీజేపీ ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని టీఎంసీ నేత అసిత్ మజుందార్ ఆరోపించారు. మరోవైపు టీఎంసీ నేతల ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఈ ఘటన ప్రజల నుంచి వచ్చిన స్వచ్ఛంద స్పందన అని ఉత్తరపారా బీజేపీ ఎమ్మెల్యే దీపాంజన్ చక్రవర్తి వ్యాఖ్యానించారు. దీంతో సెరాంపూర్ ర్యాలీ నేపథ్యంలో టీఎంసీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

## సేవా సంకల్ప్ అభయాన్‌లో అంగన్వాడీ ఉత్సవాలు

**కాకతీయ, ఏలూరు ప్రతినిధి :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభయాన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఎం. విజయలక్ష్మి సూచనల మేరకు కామవరపుకోట 5వ అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నాయకుడు నూతి రాటాలు, బీజేపీ నాయకురాలు ఘంటా మాధవి హాజరయ్యారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 7 వరకు పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారం, 7 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు ఇచ్చే టీహెచ్‌ఆర్, 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం, పిల్లల బరువు, ఎత్తు, ప్రధానమంత్రి మాతృవందన యోజన, ప్రీస్కూల్ ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ లబ్ధిదారులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి ఉపసర్పంచ్

- అనుచరులతో కలిసి గులాబీ గూటికి సత్తూరి యాదగిరి
- సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తల చేరిక
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు



**కాకతీయ, ఇనుగుర్తి :** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఉపసర్పంచ్ సత్తూరి యాదగిరి తన అనుచరులతో కలిసి శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో సత్తూరి యాదగిరితో పాటు సుమారు 500 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు కప్పుకున్నారు. మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. మండల అభివృద్ధి కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేస్తున్న పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు ఉపసర్పంచ్ సత్తూరి యాదగిరి తెలిపారు. క్యాడర్‌తో కలిసి బీఆర్ఎస్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. కే.టీ.రామారావు గులాబీ కండువాలు కప్పి కొత్తగా చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బానోత్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపన్యాస పోటీల్లో నూతన్ సాయికి తృతీయ స్థానం

- జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థి
- కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేత



**కాకతీయ, నెల్లికుదురు :** కంబాలపల్లిలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, నెల్లికుదురుకు చెందిన విద్యార్థి నూతన్ సాయి తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా నూతన్ సాయి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నాడు. విద్యార్థికి గైడ్ టీచర్ ఎం.ఎ. అంజుమ్ సుల్తానా మార్గదర్శకత్వం అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఉపేందర్‌రావు విద్యార్థి నూతన్ సాయి, గైడ్ టీచర్ ఎం.ఎ. అంజుమ్ సుల్తానాను అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు నూతన్ సాయికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- భూమి, భుక్తి కోసం ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం
- మహిళలు ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి
- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ పిలుపు



**కాకతీయ, నర్సంపేట టౌన్:** వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం నర్సంపేటలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల తెగువకు, పాలకుర్తి గడ్డ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, తక్కలపెల్లి రవీందర్‌రావు, మచ్చిక నరసయ్య, జిల్లా నాయకురాలు దార్ల రమాదేవి, జిల్లా నాయకులు గోనె యువరాజు తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి బొజ్జగణపయ్యలు

- హైదరాబాద్‌లో సామూహిక వినాయక నిమజ్జనాలు పూర్తి
- పోలీసు సిబ్బందితో కలిసి సంబరాల్లో పాల్గొన్న సీపీ

**కాకతీయ, హైదరాబాద్ :** ఇన్నిరోజులు భక్తుల పూజలందుకున్న వినాయక విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నగరంలో సామూహిక వినాయక నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణేశుల నిమజ్జనాన్ని కూడా నిర్ణీత సమయంలో పూర్తి చేయించామని వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమాలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగాయని సజ్జనార్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారని చెప్పారు. నిమజ్జనానికి ముందు సమీక్ష సమావేశం నిర్వహించడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించామని తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈసారి భారీ సంఖ్యలో గణేశ్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయని సజ్జనార్ తెలిపారు. ఖైరతాబాద్ వినాయక నిమజ్జనాన్ని తిలకించేందుకు సుమారు 30 లక్షల మంది, బాలాపూర్ గణేశ్ నిమజ్జనానికి సుమారు 15 లక్షల మంది హాజరైనట్లు చెప్పారు. నిమజ్జనంలో పేపర్ షాట్ మిషన్లను ఈసారి ఎక్కువగా వినియోగించినట్లు తెలిపారు.

**ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేత**

నిమజ్జనాలు పూర్తికావడంతో సచివాలయం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ వైపు రాకపోకలను పునరుద్ధరించారు. నిమజ్జనాలు ప్రశాంతంగా ముగియడంతో తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ పోలీసు సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేశారు. నిమజ్జనాల సందర్భంగా ట్యాంక్‌బండ్ చుట్టూ పలు రహదారులను పోలీసులు మూసివేశారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, లిబర్టీ, నారాయణగూడ, హిమాయత్‌నగర్, హైదర్‌గూడ, బషీర్‌బాగ్, లోయర్ ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. నిమజ్జనాలు పూర్తికావడంతో రాకపోకలను క్రమంగా పునరుద్ధరించారు.



# జనగామ అభివృద్ధికి రూ.40 కోట్లకు పైగా పనులు

- పారిశుధ్యానికి పెద్దపీట.. రూ.1.77 కోట్లతో వాహనాలు
- 54 మందికి నియామక పత్రాలు అందజేత
- మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు రూ.38 కోట్లతో శ్రీకారం
- విద్య, వైద్య, మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు
- జనగామ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం
- రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కాకతీయ, జనగామ :** జనగామ జిల్లా అభివృద్ధికి రూ.40 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర గృహ నిర్మాణం, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శ్రీకారం చుట్టారు. జనగామ మున్సిపల్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి.. పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేశారు. జనగామ మున్సిపాలిటీకి రూ.1.77 కోట్ల విలువైన 16 చెత్త సేకరణ ఆటోలు, ఒక జేసీబీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపాలిటీలో పనిచేసేందుకు ఎంపికైన 30 మంది శానిటరీ వర్కర్లు, 20 మంది డ్రైవర్లు, నలుగురు ఎలక్ట్రీషియన్లు కలిపి 54 మందికి నియామక పత్రాలు అందజేశారు. రూ.2 కోట్లతో చేపట్టనున్న డంపింగ్ యార్డు షెడ్, మెషినరీ పనులకు, రూ.38 కోట్లతో నిర్మించనున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

**తహసీల్దార్ కార్యాలయం.. పాఠశాలల్లో పనులు**

తరిగొప్పుల మండలంలో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. బచ్చన్నపేట మండలం కట్కూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో రూ.38.75 లక్షలతో చేపట్టనున్న మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. పోచన్నపేట ఎంపీపీఎస్‌లో రూ.24 లక్షలు, రామచంద్రాపురం ఎంపీపీఎస్‌లో రూ.23 లక్షలు, జనగామలోని కోర్టు సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో రూ.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని 12 కేజీబీవీలు, 15 పీఎం శ్రీ పాఠశాలలు, 28 జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలల్లో రూ.1,92,31,996 వ్యయంతో అవుట్‌డోర్ బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణ పనులను ప్రారంభించారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడా వసతులు అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఈ పనులు చేపట్టారు. జనగామ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రూ.19.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చంపక్ హిల్స్‌లోని మాతాశిశు ఆసుపత్రిలో రూ.7.35 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్‌కు 50 మీటర్ల సీసీ రోడ్డు, పార్కింగ్ ప్రాంతంలో గ్రావెల్ నింపడం, సెప్టిక్ ట్యాంక్ నుంచి డ్రెయిన్ వరకు పైప్ డ్రెయిన్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. జనగామ ఐడీఓసీ వద్ద రూ.10 లక్షలతో పార్కింగ్ టైల్స్, ఫెన్సింగ్, రూ.31 లక్షలతో కలెక్టరేట్ భవనానికి ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనగామ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## చెరువు శిఖం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి గ్రామస్తులు

**కాకతీయ, పెద్దవంగర :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామ శివారులోని ఊరకుంట చెరువు శిఖం భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని గ్రామస్థులు శనివారం తహీసల్దార్ వినోద్ కుమార్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెరువు శిఖం భూములు కబ్జాకు గురికాకుండా కాపాడి, శిఖం భూమిని ఆక్రమించిన పాకనాటి రామకృష్ణ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డిలపై చర్యలు తీసుకొని,ఊరకుంట చెరువు శివారు భూములు సర్వే చేయించి షికాం భూమిని కాపాడాలని తహసీల్దార్ ను కోరారు.ఈ కార్యక్రమంలో యాసరపు ప్రవీణ్,అనిల్,వెంకన్న,యాకయ్య,జల్గం భూపాల్, సంజీవ,శ్రీను,హరీష్, కొమ్ము రామచంద్రు, ఎర్రబెల్లి రవి,శివరాత్రి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు దారేది?



**కాకతీయ, ఏటూరునాగారం:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామంలో స్మశానవాటికకు సరైన రహదారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో దారి బురదమయంగా మారడంతో మృతదేహాలను స్మశానవాటికకు తరలించేందుకు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ఇతర అభివృద్ధి పనులపై హామీలు ఇస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు స్మశానవాటిక రహదారి సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశానవాటికకు శాశ్వత రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

## మానాల సిద్ధి వినాయకుడి లడ్డూకు భారీ డిమాండ్



**కాకతీయ, రుద్రంగి:** రుద్రంగి మండలం మానాల గ్రామం హనుమాన్‌వాడకు చెందిన శ్రీ సిద్ధి వినాయక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణనాథునికి సమర్పించిన లడ్డూను గ్రామానికి చెందిన తోట్ల కొమురయ్య-లక్ష్మీ దంపతులు రూ.62,101కు సొంతం చేసుకున్నారు. భక్తి, ఉత్సాహంతో సాగిన వేలంలో లడ్డూను దక్కించుకున్న కొమురయ్య-లక్ష్మీ దంపతులను మండలి సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.c

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**



**కాకతీయ, నల్లగొండ :** నల్లగొండ జిల్లా కాకులకొండారం గ్రామానికి చెందిన బాకీ మల్లయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగతో కలిసి శుక్రవారం మల్లయ్య నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి బాకీ నర్సింహా మాదిగ, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని రామకృష్ణ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కావ్యంపెల్లి రవి మాదిగ, రాష్ట్ర ముఖ్య నాయకులు సప్పి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

## 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పర్వతగిరి పోలీసులతో కలిసి శనివారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏబీ తండాలో మెయినేని రాము నిర్వహిస్తున్న లక్ష్మీ పౌల్ట్రీ ఫామ్‌పై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. ఈ తనిఖీల్లో 50 కిలోల చొప్పున 14 బస్తాల పీడీఎస్ బియ్యం, 50 కిలోల చొప్పున 4 బస్తాల పీడీఎస్ విరిగిన బియ్యం, క్వింటాలు చొప్పున మరో 7 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 16 క్వింటాళ్లు 1,600 కిలోల పీడీఎస్ బియ్యం, విలువ సుమారు రూ.56 వేలుగా పోలీసులు వెల్లడించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచిన మెయినేని రామును అదుపులోకి తీసుకున్న పోలీసులు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చర్యల కోసం పర్వతగిరి పోలీసులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఏ. మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ జి. సుబ్బారెడ్డి, ఎస్ఐ బి. ఉప్పలయ్యతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

## సతీష్‌రెడ్డిని పరామర్శించిన దాస్యం

**కాకతీయ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్‌రెడ్డిని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. సతీష్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ములుగు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఇన్‌చార్జి బడే నాగజ్యోతి కూడా సతీష్‌రెడ్డిని పరామర్శించిన వారిలో ఉన్నారు.



## వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- గ్రామస్థాయి నుంచే అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తాం
- క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు
- స్టేడియాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం
- యువతకు శిక్షణ, ప్రోత్సాహం అందించాలి
- క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణ.. ఆత్మవిశ్వాసం
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




**కాకతీయ, హనుమకొండ :** వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు గ్రామస్థాయి నుంచే ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్, ఇండియా యూత్ అండర్ 18 సెలెక్షన్ ట్రయల్ క్యాంప్‌లో నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. స్టేడియాన్ని కేవలం క్రీడా మైదానంగా కాకుండా అన్ని సౌకర్యాలతో కూడిన స్పోర్ట్స్ హబ్‌గా అభివృద్ధి చేసేలా సమగ్ర రూపకల్పనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**గ్రామస్థాయి నుంచే ప్రతిభను గుర్తించాలి**

క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు గ్రామస్థాయి నుంచే ప్రతిభను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ఎక్కువ మంది ప్రతిభావంతులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కింది స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు.విద్య, వైద్యం తర్వాత క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేస్తాయని చెప్పారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, యువత క్రీడలను భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కే.ఆర్.నాగరాజు, నగర పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌లో చేరినా కాంగ్రెస్‌కు నష్టం లేదు

- ప్రజలిచ్చిన పదవికి, వార్డు ప్రజల విశ్వాసానికి గౌరవం ఇవ్వాలి
- పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచి విశ్వసనీయత నిరూపించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్



**కాకతీయ, ఇనుగుర్తి:** స్థానిక ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌లో చేరినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ అన్నారు. శనివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, దిశా కమిటీ సభ్యుడు గుజ్జునూరి బాబురావు, వార్డు మెంబర్ నద్దునూరి ప్రశాంత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన పదవికి, వార్డు ప్రజల విశ్వాసానికి గౌరవం ఇవ్వాలని సూచించారు. పదవికి రాజీనామా చేసి తిరిగి వార్డు మెంబర్‌గా పోటీ చేసి గెలిచి విశ్వసనీయతను నిరూపించుకోవాలని అన్నారు. ఒక వ్యక్తి పార్టీని వీడినంత మాత్రాన కాంగ్రెస్‌కు నష్టం జరగదని, ఇనుగుర్తి మండల కేంద్రంలో పార్టీ బలంగా ఉందన్నారు. కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు మండల పార్టీ, స్థానిక నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కొట్టం రాము, సీనియర్ నాయకులు మామిడి జనార్ధన్, కుంచాల రమేష్, కొణతం రాములు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇస్లావత్ చందు, మహంకాళి సలీం, వార్డు మెంబర్లు శ్రీకాంత్, భూర ఇస్తారి, సురేష్, కొలిపాక నారాయణ, కొణతం ప్రభాకర్, నాగెల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలి

- పెండింగ్ ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే చెల్లించాలి
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాశాఖ శ్రద్ధ చూపాలి
- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచుల డిమాండ్



**కాకతీయ, గీసుగొండ :** మండలంలో మంజూరైన నిధులతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేసి చెల్లించాలని గీసుగొండ మండల సర్పంచులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రమేష్ అధ్యక్షతన, ఇన్‌చార్జి ఎంపీడీవో కమలాకర్ ఆధ్వర్యంలో రెండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో మండలంలోని సమస్యలపై సమీక్షించారు. నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు తెలిపారు. గ్రామాల అభివృద్ధి పనులకు మొరం తరలించేందుకు పంచాయతీలు తీర్మానాలు చేసినా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి మంజూరైన నిధులతో గిరిజన గ్రామాల్లో పనులను త్వరగా ప్రారంభించాలని రాంపూర్ సర్పంచ్ రడం భరత్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని బొడ్డు చింతలపల్లి సర్పంచ్ పోగుల వనిత విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్, డీఈ జ్ఞానేశ్వర్, మండల అధికారులు శేషాంజన్ స్వామి, హరిప్రసాద్ బాబు, రవీందర్, అనిల్‌కుమార్, సర్పంచులు వీరగోని రాజ్‌కుమార్, శ్రవణ్, రాఘవేంద్ర, వీరేందర్, వీరన్న, యాకయ్య, సతీష్, రాజు, సుభాష్, యమున, అమృత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**



**కాకతీయ, హైదరాబాద్ :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువ, పాలకుర్తి గడ్డ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ నిప్పుకణికలా పోరాడిన ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. యావత్ మహిళా లోకం ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

**కాకతీయ, మొగుళ్లపల్లి :** మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన దాసరి రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద కోలుకుంటుండగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం పర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిమ్మాపురం ఆనంద్ మాతృమూర్తి సారక్క, బుర్కపల్లి చంద్రయ్య మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సరిగొమ్ముల విజయరత్నం (పోషయ్య) మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లిన గండ్ర వెంకటరమణారెడ్డి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## చికెన్, మటన్ సరఫరాకు టెండర్లు

- 2026-27 విద్యా సంవత్సరానికి సరఫరా
- చికెన్‌కు రూ.2 లక్షలు.. మటన్‌కు రూ.75 వేల అంచనా
- జనగామ జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి

**కాకతీయ, జనగామ :** జనగామ జిల్లాలోని తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో 202627 విద్యా సంవత్సరానికి అవసరమైన మాంసాహార పదార్థాల సరఫరాకు టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ప్రకటించింది. జనగామ బాలికల విద్యాలయం, కళాశాల, ముల్కూర్ బాలికల విద్యాలయం, కళాశాలకు స్కిన్‌లెస్ చికెన్, మటన్ సరఫరా చేసేందుకు అర్హులైన సంస్థల నుంచి టెండర్లు కోరింది. టెండర్‌లో స్కిన్‌లెస్ చికెన్‌కు కిలో రూ.2,500 చొప్పున, మటన్‌కు కిలో రూ.2,500 చొప్పున ధర నిర్ణయించారు. వార్షిక సరఫరాకు చికెన్‌కు రూ.2 లక్షలు, మటన్‌కు రూ.75 వేల ధరావత్తు సొమ్ముగా పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులతో పాటు ఈఎండీ వివరాలను టెండర్ ఫారంలో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఈనెల 28 నుంచి అక్టోబర్ 6 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మైనారిటీల సంక్షేమ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ అక్టోబర్ 6 సాయంత్రం 3 గంటలుగా పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులను అక్టోబర్ 7 సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో తెరవనున్నట్లు ప్రకటనలో వెల్లడించారు.

## ఆలేరులో భూ రీసర్వేపై అవగాహన



- రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలి
- అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్ సూచన

**కాకతీయ, నెల్లికుదురు:** నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో శనివారం భూభారతి, భూ రీసర్వే కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్‌కుమార్, ఏడీఎస్ఎల్ఆర్ శ్రీనివాసులు, తహసీల్దార్ చందా నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రీసర్వే ఉద్దేశం, భూముల సర్వే ప్రక్రియ, భూ హద్దుల నిర్ధారణ, రికార్డుల నవీకరణపై వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించి, సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. భూ హక్కులు, భూ రికార్డులకు సంబంధించిన వివరాలపై అపోహలకు లోనుకాకుండా అధికారుల సూచనలను పాటిస్తూ రీసర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయిని పద్మ, సర్వే సిబ్బంది, జీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో మంత్రి పొంగులేటికి నిరసన సెగ

- రూ.500 గ్యాస్, రూ.4 వేల పింఛన్ ఎప్పుడిస్తారంటూ నిలదీత
- ఇందిరమ్మ చీరలు ధరించి మహిళల నిరసన

**కాకతీయ, జనగామ :** జనగామలో నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వేదికపై ఉండగానే మహిళలు నిరసనకు దిగారు. ఇందిరమ్మ చీరలు ధరించి సభకు వచ్చిన మహిళలు రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.4 వేల పింఛన్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారంటూ మంత్రిని నిలదీశారు. తమ సమస్యలను చెప్పేందుకు ప్రయత్నించగా పోలీసులు మహిళలను మాట్లాడకుండా అడ్డుకోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266